నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 మంగళవారం 27 ఆగస్టు 2024 MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD



తిర్యాణి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు



రోగులతో కిక్కిరిసిన లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖాన

# అందని వైద్యం అవస్థల్లో గిరిజనం

## ఏజెన్సీలోని పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బంది కొరత

- గ్లూకోస్ బాటిళ్లు, పారాసిటమల్ గోలీలు సైతం కరువే
- సేవలు అందక అవస్థలు పడుతున్న అడవిబిడ్డలు
- 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో వెలుగుచూసిన ఆసక్తికర విషయాలు

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 26(నమస్తే తెలంగాణ) : జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ వైద్య సేవలు అందని ద్రాక్షగానే మారుతున్నాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది కొరతతో పాటు మందులు సైతం అందుబాటులో లేకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. సోమవారం 'నమస్తే తెలంగాణ' ఏజెన్సీలోని పలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను విజిట్ చేయగా, ఆసక్తికర విషయాలు వెలుగు చూశాయి.

- సిర్పూర్-యు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఇద్దరు వైద్యులు ఉండాల్సి ఉండగా, ఒక్కరు కూడా హాజరుకా లేదు. ఈ దవాఖానలో కనీసం గ్లూకోస్ బాటిళ్లు, పారాసెటమల్ గోలీలు సైతం అందుబాటులో లేవు. నలుగురు స్టాఫ్ నర్సులకుగాను, ఒక్కరూ కూడా లేరు. ఫార్మాసిస్ట్ పోస్టు సైతం ఖాళీగా ఉంది. జన్‌ధన్ యోజన ద్వారా ఒక వైద్యుడిని ఇన్‌చార్జిగా నియమించినా అతను కూడా రాకపోవటంతో సిర్పూర్-యు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎలాంటి వైద్య సేవలు అందడం లేదు.
- తిర్యాణి మండల కేంద్రంలోని 30 పడకల ఆరోగ్య కేంద్రంలో అంతంత మాత్రంగానే వైద్య సేవలు అందుతున్నాయి. 8 మంది డాక్టర్లకుగాను, ఒక్క వైద్యుడు మాత్రమే ఉన్నారు. ఇద్దరు ల్యాబ్‌టెక్నీషియన్లు ఉండాల్సి ఉండగా, ఒక్కరు మాత్రమే ఉండటం.. ఇతడిని కూడా లింగాపూర్ పీహెచ్‌సీకి ఇన్‌చార్జిగా నియమించారు. ఇక్కడికి రోజూ 250 నుంచి 280 వరకు రోగులు వస్తున్నారు. ప్రస్తుతం 40 మంది ఇన్‌పేషెంట్లు ఉన్నారు. స్టాఫ్ నర్సుల కొరత, ఓపీ ఏఎన్‌ఎంలు, ఫార్మసిస్ట్‌లు, ల్యాబ్ టెక్నీషియన్‌లు లేకపోవడంతో వైద్య సేవలు అందకుండా పోతున్నాయి.

### ఖాళీలే ఖాళీలు..

వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులతో ఏజెన్సీ ప్రాంత గిరిజనులు సతమతమవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 20 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 46 మంది వైద్యులు ఉండాల్సి ఉండగా, 14మంది వైద్యులు మాత్రమే రెగ్యులర్‌గా ఉన్నారు. మరో ఆరుగురు వైద్యులు కాంట్రాక్టుపై పని చేస్తున్నా రు. 77 మంది స్టాఫ్ నర్సు పోస్టులుండగా, 38 ఖాళీలు ఉన్నాయి. ఫార్మసిస్టులు 25 పో స్టులు ఉండగా, 10 మంది రెగ్యులర్, మరో 12 మంది కాంట్రాక్టుపై విధులు నిర్వర్తిస్తున్నారు. 3 ఖాళీలు ఉన్నాయి. ల్యాబ్ టెక్నీషియన్‌లు 26 మందికిగాను, రెగ్యులర్‌గా ఏడుగురు, కాంట్రాక్టుపై 12 మంది ఉన్నా రు. ఏఎన్‌ఎంలు, ఇతర పోస్టులు వందకు పైగా ఖాళీలు ఉన్నాయి.





మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో ఒకే బెడ్డు పై ఇద్దరు చిన్నారులకు చికిత్స



మంచిర్యాల దవాఖానలో ఓపీ కోసం క్యూ కట్టిన రోగులు

# సర్కారు దవాఖానలకు సమస్యల రోగం

- జిల్లాల్లో విజృంభిస్తున్న విష జ్వరాలు
- హాస్పిటళ్లకు పెరుగుతున్న రోగుల సంఖ్య
- కనీస వసతులు.. మందులు కరువు
- వైద్యులు, సిబ్బంది లేక అవస్థలు
- సరిపోని బెడ్‌లు.. ఒకే మంచంపై ఇద్దరికి వైద్యం
- 'నమస్తే తెలంగాణ' విజిట్‌లో వెలుగుచూసిన నిజాలు

జిల్లాలోని సర్కారు దవాఖానలకు 'సమస్యల' జబ్బు పట్టుకున్నది. సౌకర్యాల లేమి.. సిబ్బంది కొరతతో రోగులు అవస్థలు పడాల్సి వస్తున్నది. సరిపడా బెడ్లు లేక.. ఒకేమంచంపై ఇద్దరికి సేవలందించాల్సిన పరిస్థితి దాపురించింది. ఇక మందులు అందుబాటులో లేక బయట కొన్నుక్కోవాల్సిన దుస్థితి నెలకొన్నది. ప్రస్తుతం విష జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో సోమవారం 'నమస్తే తెలంగాణ' పలు హాస్పిటళ్లను విజిట్ చేయగా, అనేక విషయాలు వెలుగుచూశాయి.

మంచిర్యాల ప్రతినిధి/నమస్తే న్యూస్ నెట్‌వర్క్ : మంచిర్యాల జిల్లాలో విషజ్వరాలు విజృంభిస్తున్నాయి. జన్నారం, నెన్నెల, లక్షెట్టిపేట, చెన్నూర్ మండలాల్లోని కొన్ని గ్రామాల్లో వందలాది మంది మంచం పట్టినట్లు తెలుస్తున్నది. పల్లెల్లో వైద్య సదుపాయాలు లేక చెన్నూర్, బెల్లంపల్లి, మంచిర్యాల, లక్షెట్టిపేటలోని ప్రభుత్వ దవాఖానలకు రోగులు పరుగులు పెట్టాల్సి వస్తున్నది. జ్వర బాధితుల పరిస్థితిని బట్టి పెద్ద దవాఖానలకు రెఫర్ చేస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు.

### ఒకే బెడ్‌పై ఇద్దరికి వైద్యం

మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో సరిపడా పడకలు లేక ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఒకే బెడ్‌పై ఇద్దరిని పడుకోబెట్టి వైద్యం అందిస్తున్నారు. ఇక్కడ రోజూ ఓపీ 900 పైచిలుకు ఉంటున్నా.. కనీస సదుపాయాలు కల్పించడంతో వైద్యులు విఫలం అవుతున్నారు. ఇక్కడ ఆరోగ్యశ్రీ వార్డు ప్రస్తుతం ఖాళీగానే ఉంది. అందులో ఏసీలు సైతం ఉన్నాయి. బెడ్లు కూడా ఉన్నాయి. కానీ అది ఎందుకు ఖాళీగా ఉంచారన్నది అర్థం కావడం లేదు. ఒక వార్డు మొత్తాన్ని ఖాళీగా ఉంచి వరండాల్లో మడత మంచాలు వేసి వైద్యం అందిస్తుండడం విడ్డూరంగా అనిపించింది. సెంట్రల్ డ్రగ్ స్టోర్ (సీడీసీ) ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉండడంతో మందుల కొరత ఏర్పడుతున్నది. మందులు లేక బయటకు వెళ్లి తెచ్చుకోమని వైద్య సిబ్బంది చెబుతున్నట్లు రోగులు అంటున్నారు. చిన్న పిల్లల వార్డులోని ఒక రూమ్‌లో ఫ్యాన్ పని చేయకపోవడంతో ఇంటి నుంచి ఫ్యాన్ తెచ్చుకొని వాడుతున్నారు. మొన్నటికి మొన్న 'నమస్తే' కథనంతో కలెక్టర్ వచ్చి దవాఖానను పరిశీలించినా.. పనితీరు ఏ మాత్రం మారినట్లు కనిపించలేదు. మూత్ర పరీక్షల కోసం శాంపిళ్లు తీసుకు రావడానికి రోగులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌లు పనిచేయక చేతిలో డబ్బాలు పట్టుకొని బయటకి వెళ్తున్నారు.

### 56వేల జనాభాకు ఒక్కరే డాక్టర్..

జన్నారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అరకొర వసతులతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని 29 గ్రామ పంచాయతీల్లో 56 వేల జనాభాకు ఒకటే దవాఖాన, ఒక్కరే వైద్యుడు ఉన్నాడు. ఇక్కడ కేవలం 6 బెడ్లు మాత్రమే ఉన్నాయి. ఒక్క బెడ్‌పై ఇద్దరు రోగులకు వైద్యం అందిస్తున్నారు. ప్రతి రోజూ 120 నుంచి 150 ఓపీ వస్తుందని వైద్యాధికారి గంగాభవాణి తెలిపారు. ఎలర్జి, వైరల్ ఫీవర్, జలుబు, దగ్గు, విరోచనాలు, కోతులు, కుక్కల కాటుకు గురైనవారు ఎక్కువగా వస్తున్నారు.



మంచిర్యాల దవాఖానలో ఇంటి నుంచి తెచ్చుకున్న ఫ్యాన్‌ను పెట్టుకున్న రోగి బంధువులు

### 23 పడకలు సరిపోవడం లేదు..

లక్షెట్టిపేట ప్రభుత్వ దవాఖానలో రోజుకు 100 నుంచి 150 మంది పేషెంట్లు వస్తున్నారు. వెంకట్రావుపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సైతం రోజు 100 దాకా ఓపీ చూస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ సతీశ్ తెలిపారు. జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరగుతుండడంతో బెడ్లు సరిపోవడం లేదు. లక్షెట్టిపేటలో 30 పడకల ప్రభుత్వ దవాఖాన ఉంటే, ఇందులో కేవలం 23 బెడ్లు మాత్రమే ఉన్నాయి. తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ రోజూ 10 నుంచి 15 మంది ఇక్కడ చేరుతున్నారు. దీంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇది తాత్కాలిక భవనం కావడంతో అదనపు బెడ్లు వేయడం కష్టంగా మారిందని వైద్యులు అంటున్నారు. ఇదిలా ఉండగా లీవో సిట్రజిన్, ఆంటీబెటిక్ ట్యాబ్లెట్స్, సెలైన్స్ కావాల్సిన మేరకు అందుబాటులో లేవని తెలిసింది.

### ఆవుడంలో ఒకరికి డెంగ్యూ పాజిటివ్

నెన్నెల మండలం ఆవుడం గ్రామస్తులు రెండు వారాలుగా జ్వరాలతో బాధపడుతున్నారు. ఇక్కడ ఓ వ్యక్తికి డెంగ్యూ పాజిటివ్ వచ్చింది. దీంతో మిగిలిన జ్వర పీడితులు తమకు వచ్చింది సాధారణ జ్వరమా లేక డెంగ్యూనా అని ఆందోళన చెందుతున్నారు. ఘన్‌పూర్ గ్రామంలో జ్వర పీడితులు ఎక్కువగా ఆర్‌ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. నెన్నెల, నందులపల్లి, జంగాల్‌పేట గ్రామాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది. నెన్నెల కేబీజీఎస్‌లో విద్యార్థులకు జ్వరాలు రావడంతో ప్రత్యేక వైద్య బృందం వచ్చి సేవలందిస్తున్నది. జ్వరాలతో బాధపడుతున్న విద్యార్థులను ఇండ్లకు పంపిస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. జ్వరాలు వచ్చే వారిలో ఎక్కువ మందికి ప్లేట్‌లేట్స్ తగ్గుతున్నట్లు వైద్యులు చెబుతున్నారు. నెన్నెల ఆరోగ్య కేంద్రంలో రెండు నెలలుగా ల్యాబ్ టెక్నీషియన్ లేక టెస్టులు జరగడం లేదు. గతంలో ఉన్న ఎల్‌టీ బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో కొత్తవారు రాలేదు. దీంతో పీహెచ్‌సీకి వచ్చే రోగులకు రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు చేయడానికి వీలులేకుండా పోయింది. కేవలం జ్వరానికి ట్రీట్‌మెంట్ చేసి పంపిస్తున్నారు తప్పితే టెస్టులు చేయడం లేదు. ఈ కారణంగా చాలా మంది వైద్య పరీక్షల కోసం పట్టణాలకు వెళ్లి రక్త,మూత్ర పరీక్షలు చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. విష జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో ల్యాబ్ టెక్నీషియన్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుందని రోగులు అంటున్నారు.



మంచిర్యాల దవాఖానలో వరండాల మడత మంచాలపై చికిత్స పొందుతున్న రోగులు

### దవాఖానలో సరైన వసతులు లేవు



మా బాబుకు జ్వరం వచ్చింది. రెండు రోజుల కింద మంచిర్యాల ప్రభుత్వ జనరల్ దవాఖానకు తీసుకొవచ్చిన. డాక్టర్లు మంచిగనే చూస్తున్నరు. కానీ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నం. ఫ్యాన్లు లేక ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవ్వాల్సి వస్తున్నది. దోమల బెడద ఉంది. చిన్న పిల్లల వార్డులో బాత్‌రూం ఒక్కటే పని చేస్తుంది. అందరం వెళ్లాలంటే క్యూ కట్టాల్సి వస్తుంది. తాగునీటి కోసం అవస్థలు పడుతున్నం. దవాఖానాలో ఇస్తున్న భోజనం బాగోలేదు. కనీసం బెడ్లపై బెడ్ షీట్లు కూడా ఇస్తలేరు. ఒక్కో బెడ్ మీద ఇద్దరిద్దరిని ఉంచి వైద్యం చేస్తున్నరు.

*- సుందిళ్ల సుమతి, ఊరు శ్రీరాంపూర్*

### మడత మంచాలపై పడుకోబెట్టిన్రు



నాకు జ్వరం వచ్చి మూడు రోజులైతంది. మంచిర్యాల దవాఖానాకు వచ్చిన. బెడ్లు లేవని మడత మంచాలపై వైద్యం చేస్తున్నరు. ఇక్కడ సరైన వసతులు లేవు. ఇబ్బందులు పడాల్సి వస్తుంది. జ్వరమని వస్తే చర్మం మీద పుండ్లు అవుతున్నాయి. ఏం చేసుడో అర్థమైతలేదు. ప్రైవేటుకు వెళ్లి వైద్యం చేయించుకునే స్థోమత లేక ఇక్కడే ఉండాల్సి వస్తుంది.

*- బండారి రాజేశ్వరి, కైరిరామ, ఆసిఫాబాద్*

### ఫ్యాన్లు లేవు..

నాకు జ్వరం రావడంతో మూడు రోజుల కింద మంచిర్యాల దవాఖానాకు వచ్చిన. వచ్చిన రోజే పరీక్షల కోసం రక్తం తీసుకున్నరు. ఇప్పటి వరకు ఏం రోగం వచ్చిందన్నది చెప్పలేదు. వరండాలో పడుకోబెట్టిన్రు. ఫ్యాన్లు లేక ఉక్కపోతతో ఇబ్బంది పడుతున్న. దోమల బెడద ఉంది.

*- ఆవునూరి భానుప్రియ, మంచిర్యాల*



నెన్నెల ఆరోగ్య కేంద్రంలో జ్వరంతో చికిత్స పొందుతున్న మహిళలు



మంచిర్యాల ప్రభుత్వ దవాఖానలో ఖాళీగా ఉన్న ఆరోగ్యశ్రీ వార్డు, దుమ్ముతో ఉన్న బెడ్లు



జైనూర్ మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న గిరిజనులు

# జైనూర్ సీహెచ్‌సీలో వైద్యులను నియమించండి

- ఆదివాసీ సంఘాల డిమాండ్.. రాస్తారోకో
- సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు
- పారాసిటమల్ గోలీలు, సెలైన్ బాటిళ్లు సైతం లేవని మండిపాటు
- ఇరువైపులా ట్రాఫిక్ జామ్

కుమ్రం భీం ఆసిఫాబాద్, ఆగస్టు 26 (నమస్తే తెలంగాణ) : జైనూర్ సామాజిక ఆరోగ్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్యులు, సిబ్బందిని నియమించాలని ఆదివాసీ సంఘాల నాయకుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం జైనూర్ మండలం కేంద్రంలో రాస్తారోకో నిర్వహించారు. ఎమినిది మంది వైద్యులకుగాను, ఒక్క వైద్యుడే ఉన్నాడని, సిబ్బంది పోస్టులు కూడా ఖాళీగా ఉన్నాయని, పారాసిటమల్ గోలీలు, సెలైన్ బాటిళ్లు సైతం అందుబాటులో లేవని మండిపడ్డారు. ఏజెన్సీలో వైద్యంపై నిర్లక్ష్యం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. రాస్తారోకోతో ఇరువైపులా భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళన విరమింపజేశారు. ఆదివాసీ సంఘాల నాయకుడు కనక యాదవ్‌రావు మాట్లాడుతూ సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల నుంచి కూడా జైనూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికే వందలాది పేషెంట్లు వస్తారని, సరైన సేవలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా వైద్యాధికారికి అనేకసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

# గ్యాస్ లీకై రెండిళ్లు దగ్ధం

- చెన్నూర్ మండలం ఆస్నాద్‌లో ఘటన
- కూతురు పెండ్లి, ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న బంగారం, నగదు కాలిబూడిద
- సర్కారు ఆదుకోవాలని వేడుకుంటున్న బాధితులు

చెన్నూర్ రూరల్, ఆగస్టు 26 : గ్యాస్ లీకై రెండిళ్లు దగ్ధం కాగా, యువతి పెండ్లి, ఇంటి నిర్మాణం కోసం దాచుకున్న డబ్బులు, బంగారం కాలిపోయిన ఘటన చెన్నూర్ మండలం ఆస్నాద్‌లో సోమవారం జరిగింది. ఆస్నాద్ గ్రామానికి చెందిన సోదరులు ఇంగిలి శ్రీనివాస్, లింగయ్య తమ కుటుంబ సభ్యులతో కలిసి ఉదయం 9 గంటలకు జైపూర్ మండలంలోని వేలాల ఆలయానికి వెళ్లారు. ఈ క్రమంలో 10 గంటల ప్రాంతంలో లింగన్న ఇంటిలోని గ్యాస్ సిలిండర్ లీకై ఒక్కసారిగా పేలింది. పెద్ద ఎత్తున మంటలు చెలరేగి శ్రీనివాస్, లింగయ్య ఇండ్లు దగ్ధమయ్యాయి. పేలుడు శబ్ధానికి చుట్టు పక్క వాళ్లంతా పరుగులు తీశారు. లింగన్న కూతురుకు ఇటీవల వరపూజ అయింది. కూతురు పెళ్లి కోసం దాచిన 8 తులాల బంగారంతో పాటు రూ. 4 లక్షలు, అలాగే శ్రీనివాస్ నూతన గృహ నిర్మాణం కోసం దాచుకున్న రూ. 2 లక్షలు, 2 తులాల బంగారం కాలిపోయింది. ఇండ్లలోని సామగ్రి సైతం కాలిబూడిదైనట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఫైర్‌స్టేషన్ సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చింది. చెన్నూర్ ఎస్‌ఐ సుబ్బారావు కాలిపోయిన ఇండ్లను పరిశీలించారు. మొత్తం రూ. 20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.



ఆస్నాద్‌లో మంటలార్పుతున్న ఫైర్ సిబ్బంది, గ్రామస్తులు



ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్ : ఉట్టి కొడుతున్న యువకులు

# ఆ'నంద' హేల

## ఊరూరా కనుల పండువలా కృష్ణాష్టమి

- మందిరాల్లో భక్తుల పూజలు
- శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో అలరించిన చిన్నారులు
- పలుచోట్ల ఉట్ల సంబురాలు

*ఊరూరా శ్రీకృష్ణాష్టమి వేడుకలను సోమవారం ఆ'నంద'ంగా జరుపుకున్నారు. కృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకొని భక్తులు మందిరాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన చౌరస్తాల్లో 'ఉట్ల పండుగ'ను ఘనంగా నిర్వహించగా, యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిన్నారులు నృత్యాలతో అలరించారు. కృష్ణుడు, రాధిక, గోపిక వేషధారణలో ఆకట్టుకున్నారు. ఇక యువతులు శ్రీకృష్ణ భగవానుని గీతాలు ఆలపిస్తూ సందడి చేశారు.*

*- నమస్తే బృందం*


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571
మంచిర్యాల జిల్లా : 9182 777 676
కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679